MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 25-05-2025 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# సరస్వతీ పుష్కరాల్లో పోటెత్తిన భక్తులు

- ముగింపు దశకు చేరుకున్న సరస్వతీ పుష్కరాలు
- ముగింపు దశకు చేరుకోవడంతో పెరిగిన భక్తుల తాకిడి
- పుష్కర ఘాటు వద్ద కిక్కిరిసిన భక్తులు
- భక్త జనసంద్రంగా మారిన త్రివేణి సంగమం

క్రైమ్ మిర్రర్, మహాదేవ్ పూర్ ప్రతినిధి

కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు భక్తులు బారులు తీరుతున్నారు. భక్తజనం పుణ్యస్నానాలతో త్రివేణి సంగమం కిటికిటలాడుతోంది. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తుతున్నారు. శుక్రవారం ఒక్క రోజే లక్షన్నర మంది భక్తులు కాళేశ్వరానికి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. పుష్కరాలు ముగింపు దశకు చేరుకోవడంతో భక్తుల తాకిడి మరింత పెరిగింది

2లో



## ప్రణాళికాబద్ధంగా యువతకు ఉపాధి కల్పన చర్యలు.

### డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు

- 80 కు పైగా కంపెనీలలో 5 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మెగా జాబ్ మేళా నిర్వహణ
- 100 కోట్లతో వైరా ప్రాంతానికి సాగునీరు అందించే రాజీవ్ కెనాల్ పూర్తి చేసాం
- 9 వేల కోట్ల రూపాయలతో రాజీవ్ యువ వికాసం క్రింద స్వయం ఉపాధి ప్రోత్సాహం
- వైరా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సి.ఎం

8లో

## 7 కిచెన్లు సీజ్

### 38 హాస్టళ్లకు షోకాజ్ నోటీసులు

### జీహెచ్ఎంసీ టాస్క్‌ఫోర్స్ బృందాల స్పెషల్ డ్రైవ్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నగరంలోని పలు ప్రైవేట్ హాస్టళ్లలో జీహెచ్ఎంసీ టాస్క్ ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు వివిధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన హాస్టళ్లకు షోకాజు నోటీసులు ఇవ్వడంతో పాటు కిచెన్‌లు సీజ్ చేసి జరిమానాలు విధించారు. ఎల్బీనగర్ జోన్‌లోని శ్రీనగర్ కాలనీ, లలితనగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతం, కూకట్‌పల్లి జోన్‌లోని కేపీహెచ్‌బీ, మూసాపేట్ ప్రాంతాలు, శేరిలింగంపల్లి జోన్‌లోని వినాయక్ నగర్, పత్రికా నగర్‌లలో ఈ డ్రైవ్ నిర్వహించారు. 60 హాస్టళ్లను తనిఖీ చేసి 38 హాస్టళ్ల యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. 7 హాస్టల్ కిచెన్లను మూసివేశారు. జీహెచ్ఎంసీ చట్టం, 1955 నిబంధనల ప్రకారం బృందాలు రూ. 2,46,000 జరిమానా విధించారు. అదేవిధంగా శుక్రవారం 58 హాస్టళ్లను తనిఖీ చేసి 30 హాస్టళ్లకు నోటీసులు జారీ చేసి, 8 హాస్టల్ కిచెన్ లను సీజ్ చేశారు.




## ఈనెల 29 న సింగారంలో సీపీఐ 15 వ మండల మహా సభ

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం**

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** పేద ప్రజల పక్షాన కార్మికుల కర్షకుల పక్షాన పోరాడే మొట్టమొదటి పార్టీ సీపీఐ పార్టీ అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం అన్నారు..మునుగోడు మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బొమ్మరగోని అధ్యక్షతన జరిగిన సమావేశంలో గురుజ రామచంద్రం పాల్గొని మాట్లాడారు..కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు..ఈనెల 29 న సింగారంలో జరిగే 15 వ మండల మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు..మండల కార్యదర్శి చాపల శ్రీను,జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, గోస్కొండ లింగయ్య, బండమీది యాదయ్య, పాండు,దుబ్బ వెంకన్న, ఈధులకంటి కైలాష్, వెంకన్న, నరసింహ, ఎల్లయ్య, బెల్లం శివయ్య, ఆంజనేయులు,పాల్గొన్నారు.

## మాతృ మరణాలు నివారించాలి

**-జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మణ్**

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కల్వకుర్తి డివిజన్ ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో వైద్య అధికారులకు, పర్యవేక్షణ సిబ్బందికి మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రతి గర్భవతి సురక్షిత మాతృత్వం పొందే విధంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రతి గర్భవతిని 12 వారాల్లోపే నమోదు చేయాలని, తప్పనిసరిగా స్త్రీ వైద్య నిపుణులచే పరీక్ష చేయించాలని, హైరిస్క్ గర్భవతులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలియజేశారు. గర్భవతుల పరీక్షల కొరకు, హైరిస్క్ గర్భవతుల ప్రత్యేక ఫాలో అప్ కొరకు ప్రసవ సమయంలో కల్వకుర్తి కమిటీ ఆరోగ్య కేంద్రంలోని హెల్ప్ డెస్క్ సిబ్బంది సహాయం తీసుకోవాలని తెలియజేశారు. గర్భవతుల పరీక్షలకు 102 వాహనం సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఇకనుంచి మాతృ మరణ సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భీమానాయక్, వైద్యాధికారులు డాక్టర్ అతావుల్లా ఖాన్, డాక్టర్ మంజు భార్గవి, డాక్టర్ సింధు, డాక్టర్ శివకుమార్, సి హెచ్ ఓ శ్రీనివాసులు, డి పిహెచ్ ఎన్ ఓ మంగమ్మ, డిపిఎమ్ఓ ఆజాద్, ఎంపిహెచ్ ఈ ఓ పర్వతాలు, సూపర్వైజర్ యశోద, హెల్ప్ డెస్క్ సిబ్బంది పాల్గొన్నారు.



# సరస్వతీ పుష్కరాల్లో పోటెత్తిన భక్తులు





కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. భక్తుల పుణ్య స్నానాలతో త్రివేణీ సంగమం భక్త జన సంద్రంగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పుష్కర ఘాట్‌లకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు కోటిన్నర మందికిపైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారని అధికారులు వెల్లడించారు. భక్తులు సరస్వతి నదిలో పుణ్య స్నానాలు చేసి పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు సైతం వచ్చి పుష్కర స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

**దూర ప్రాంత భక్తుల కోసం టెంట్?సిటీ**

దూర ప్రాంతాల నుంచి భక్తుల కోసం ప్రత్యేకంగా టెంట్ సిటీ ఏర్పాటు చేశారు. పుష్కర ఘాట్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ తాత్కాలిక వసతి గృహాలకు భక్తుల నుంచి మంచి డిమాండ్ ఉంది. 3 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 41 టెంట్‌లను ఏర్పాటు చేసినట్లు నిర్వహకులు తెలిపారు. టెంట్ సిటికి మరో వైపు ఫుడ్ కోర్ట్‌ను ఏర్పాటు చేశారు. టెంట్‌ను యాత్ర డాట్ కాం ద్వారా బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. అంతే కాకుండా ఒంటరిగా వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా డార్మెటరీ సదుపాయం కల్పించారు. అధునాతన వసతులతో ఏర్పాటు చేసిన వసతి గృహాలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సోమవారంతో ముగియనున్న సరస్వతీ పుష్కరాలు**

సరస్వతి ఘాట్‌లో సాయంత్రం జరుగుతున్న కాశీ పండితుల సరస్వతీ నవరత్న మాల హారతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జోరువర్షాన్ని సైతం లెక్కచేయకుండా హారతిని భక్తులు కనులారా వీక్షించి తన్మయత్వం చెందుతున్నారు. సోమవారంతో సరస్వతి పుష్కరాలు ముగియనున్నాయి. వారంతాలు కూడా కలసి రావడంతో భక్తుల తాకిడి పెరుగుతోంది. త్రివేణీ సంగమ పరిసరాలు ఈ మూడు రోజులు జనసంద్రంగా మారనున్నాయి. దీంతో ఘాట్ పరసరాల్లో అదనంగా వాహనపార్కింగ్ స్థలాలను అధికారులు సిద్ధం చేశారు. చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో సమీక్షించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా నిరంతరం పోలీసు గస్తీ పెంచారు. భక్తులెవరూ నది లోపలికి వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పెంచారు.

## కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో వెంటనే చర్చలు జరపాలి..

**సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గోదా శ్రీరాములు...**

**సంస్థాన్ నారాయణపూర్, మే 24(క్రైమ్ మిర్రర్):** కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కొనసాగిస్తున్న ఆపరేషన్ కగారును ఆపి మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్ చేశారు శనివారం నారాయణపుర్ మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల సమితి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మావోయిస్టులను హతమార్చడానికి చతిస్గడ్ తెలంగాణ ఆంధ్ర సరిహద్దుల్లో కాల్పుల మోతలతో దండకారణ్యం ఆదివాసి ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఆందోళన పడుతున్నారని ఈ దాడుల్లో అమాయక ప్రజలు బలి అవుతున్నారని ఆయన అన్నారు. మేము చర్చలకు వస్తామని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ వారి ని శాంతి చర్చలకు పిలవకుండా కేంద్ర హెూం మంత్రి వారిని అంతమొందించడమే మా లక్ష్యం అని చెప్పడం చాలా దుర్మార్గమని ఆయన అన్నారు సమావేశానికంటే ముందు సిపిఐ జాతీయ నాయకులు అమరజీవి నల్లమల గిరి ప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది . ప్రజా సమస్యలే అజెండాగా పోరాటాలు నిర్వహించాలని సిపిఐ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. అన్ని గ్రామాలలో పార్టీ గ్రామ శాఖ మహాసభలను నిర్వహించాలని ఆ తర్వాత మండల




మహాసభ నిర్వహించు కోవాలని సూచించారు రాబోయే రోజులలో కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేసి నారాయణపుర్ మండలంలో మొనగాని పార్టీగా నిలుపాలని దీనికోసం మండల నాయకుడు కార్యకర్తలు సమిష్టిగా ముందుకెళ్లాలని ఆయన కోరారు ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గోని గాలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కే శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్,జిల్లా కౌన్సిల్ సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, వీరమల్ల యాదయ్య, సుర్వి నరసింహ,మంచాల జంగయ్య, దుబ్బాక సంజీవ, కొప్పు సుధాకర్, ముత్యాల అంజయ్య, మన్నే భీమారెడ్డి, గుండు నరసింహ, కొర్ర శంకర్, బీనపల్లి గాలయ్య, కె. లచ్చు, బద్దుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు పోతున్న శంకర్ పల్లి పత్తెపూర్ రోడ్డు గుంతలను పుడ్చారా





**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకి ఈ గుంతలు కనిపించడం లేదా**

**ప్రతిరోజు ఈ గుంతల రోడ్డు పైనా ప్రయాణం**

**ధర్నా చేసిన శంకర్పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ నరేష్ కుమార్**

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శనివారం శంకర్పల్లి నుండి ఫతేపూర్ వరకు ఏర్పడిన గుంతలను ఇంకెప్పుడు మరమ్మత్తులు చేస్తారని, ప్రజల ప్రాణాలు పోవాలా అని శంకరపల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్ నరేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు శనివారం సాయంత్రం శంకర్పల్లి నుండి పత్తె పూర్ రోడ్డు పై ఏర్పడిన గుంతల వద్ద శంకర్పల్లి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంతలు పూడ్చాలని ధర్నా చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగైదు సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఈ రోడ్డును బాగు చేయకపోవడంతో శంకర్పల్లి చెందిన ఒక వ్యక్తి పర్వేద గ్రామం చెందిన ఒక మహిళ ప్రాణాలు కోల్పోవడం జరిగిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ రోడ్డు గుండానే ప్రతిరోజు సంక్షేమ పథకాల కోసం తనిఖీల కోసమని మండల స్థాయి అధికారులు రాకపోకలు చేస్తున్నప్పటికీ కూడా ఫలితం కానరావడం లేదని ఆయన మండిపడ్డారు గమనించదగ్గ విషయం ఏంటంటే ఈ దారి పొడవునా వారానికి ఒకసారి చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్యంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రతి రెండు రోజులకు ఒకసారి ఈ గుంతలు పడ్డ రోడ్డు పైనుండే ప్రయాణిస్తున్నారని అయినా చలనం లేదని నరేష్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే ఎంపీ స్పీకర్ స్పందించి గుంతలు పూడ్చాలని అలాగే ఆర్ అండ్ బి అధికారులను పిలిపించి వాహనదారులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకునేలా ఆదేశించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రారంభోత్సవాలకు రావడం కాదు రోడ్డుపై రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చడం తమ విధి బాధ్యతగా గుర్తించాలన్నారు. వచ్చేది వర్షాకాలం కాబట్టి గుంతలలోనీరు నిలిచితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేేంద్ర చారి సభ్యులు మహేందర్ రెడ్డి ఇందూర్ రాజు కరాటే రవి పర్వేద రవి జన్వాడ రాజు గంగాధర్ బసవరాజ్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు



# ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం జిల్లా స్థాయిలో 1934 మంది ఉపాధ్యాయులు, మండల స్థాయిలో 1368 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు, నేటితో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు పూర్తి అయినట్లు నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ తెలిపారు..శనివారం తిమ్మాజీపేట, బిజినపల్లి, నాగర్ కర్నూల్ మండలాల్లో కొనసాగుతున్న చివరి రోజు శిక్షణ తరగతులను డీఈఓ రమేష్ కుమార్ సందర్శించారు. ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్లు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఉపాధ్యాయులు నవీన బోధనా పద్ధతులు, నైపుణ్యాలను జోడిస్తూ మరింత సమర్ధవంతమైన తరగతి బోధన పద్ధతులను కొనసాగించాలని సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి వృత్యాంతర ఉపాధ్యాయ శిక్షణ తరగతులు దోహదపడతాయని డిఇఓ పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీ నుంచి వివిధ స్థాయిలలో దశలవారీగా సబ్జెక్టుల వారీగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 25 శిక్షణ కేంద్రాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల విద్యాధికారులు భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ శెట్టి తదితరులు ఉన్నారు.

# పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథక రక్షణకై ఈనెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాకు వందలాదిగా కార్మికులు తరలి రావాలి





**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహా పిలుపు**

**భువనగిరి, మే 24(క్రైమ్ మిర్రర్ ప్రతినిధి):** వలసలను ఆపాలని, పనన్న చూపండి తిండన్న పెంటండని లక్షలాదిమంది వ్యవసాయ కార్మికుల దేశవ్యాప్త పోరాట ఫలితంగా వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక రక్షణ కోసం ఈ నెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాకు వందలాదిగా కార్మికులు తరలి రావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భువనగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెంచికల్ పహాడ్ గ్రామంలో ఉపాధి హామీ పనిచేస్తున్న కార్మికుల వద్దకు వెళ్ళి వారి సమస్యలను తెలుసుకొన్న అనంతరం నర్సింహ మాట్లాడుతూ పేదలు కష్టజీవులు తమ జీవనోపాధి కోసం, చట్టాల కోసం, పని కోసం, భూమికోసం, భువ్వ కోసం పోరాడి హక్కులు, చట్టాలు సాధించుకుంటే కేంద్రంలోని ఈ మోడీ ప్రభుత్వం ఆహక్కులను, చట్టాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తున్నారని విమర్శించారు. దేశానికి గ్రామ సీమలే పట్టుకొమ్మలు గ్రామాలలో ఉన్న ప్రజలు ఆర్థికంగా బలపడితేనే ఈ దేశం ముందుకు పోతుందనే ఉద్దేశంతో ఆనాటి ప్రభుత్వము వందరోజుల పనిని తెస్తే ఈనాడు ఈ మోడీ ప్రభుత్వం దానిని ఎత్తివేయడానికి అనేక కుట్రలు చేస్తూ కొత్త జీవోలు తెస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా కార్మికులందరూ ఐక్యంగా సంవత్సరానికి 200 రోజుల పని దినాలకోసం, రోజు కూలి 600 రూపాయల కోసం, పెండింగ్ లో ఉన్న వేతనాల కోసం, నూతన జాబ్ కార్డుల కోసం, భార్య భర్తలకు గడ్డపార, తట్ట, పారా, కొడవలి, గొడ్డలి లాంటి పనిముట్లు కోసం, పనిచేసే దగ్గర త్రాగడానికి నీరు, నీడ కోసం టెంటు, ప్రమాదం జరిగినప్పుడు మెడికల్ కిట్టు కోసం, సమ్మర్ అలవెన్స్ ల కోసం, నాలుగు కిలోమీటర్ల దూరం దాటితే లోకల్ ఆటో చార్జీల కోసం, ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాల కోసం, ఫీల్డ్ అసిస్టెంట్లను పర్మినెంట్ చేసి వారి యొక్క వేతనాలు పెంచుట కోసం, వాచర్లను, సీనియర్ మేట్లను ప్రత్యేకంగా గుర్తించి సంవత్సరం మొత్తం పనులు కల్పించడం కోసం, అర్హత కలిగిన వారికి ఫీల్డ్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కోసం, ప్రమాదాలు జరిగితే ఉచిత వైద్యంతో పాటు, పని చేయని రోజులలో నష్టపరిహారం చెల్లింపు కోసం, ప్రమాదంలో మరణిస్తే కనీసం 10 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా కోసం, దరఖాస్తు పెట్టుకొని పని చూపని వారికి చట్ట ప్రకారం నిరుద్యోగ భృతి కోసం ఈ నెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నర్సింహ కోరారు.ద ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, జిల్లా కమిటీ సభ్యులు సిలివేరు ఎల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సిలివేరు మహేందర్ ఉపాధి హామీ కార్మికులు గోపె రాజయ్య, కొంతం లత, చిన్నం శ్రీలత, సాలమ్మ, సరోజన, సుజాత, ఇందిర, సుబ్బూరు కలమ్మ, సప్న, బీరమ్మ, రజిత, చింతల పద్మ, బాల లక్ష్మి, సిలువేరు జంగమ్మ, పొన్నాల శ్రీశైలం రెడ్డి, బాల్ రెడ్డి , బోనగిరి ఆంజనేయులు, గోపె నవనీత, మహేశ్వరి, లలిత, చిన్నం సుజాత, కడగంచి కల్పన, బాల్ల ఎల్లమ్మ, బసాని కలమ్మ, ఐలమ్మ, చింతల ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వశించిన తాడోజు వాణిశ్రీకాంత్..

**తుంగతుర్తి(క్రైమ్ మిర్రర్):** తుంగతుర్తి మండల కేంద్రంలో అంబటి సోమయ్యధనమ్మ కుమారుడు ఏకస్వామి, సౌమితల వివాహానికి తెలంగాణ ఉద్యమకారులు, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ తాడోజు వాణిశ్రీకాంత్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.. ఆరాధ్య ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న తాడోజు దంపతులకు, మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.. ఎల్లప్పుడు ప్రజలకు సేవలు చెయ్యాలని కోరారు.. నియోజకవర్గంలో తనదైన శైలిలో జనాధారణ పొందిన వాణిశ్రీకాంత్ లకు యువత ప్రోత్సాహం ఎక్కువనే చెప్పాలి.. ఈ కార్యక్రమంలో ఆరాధ్య ఫౌండేషన్ నాయకులు అంబటి రాములు తదితరులు పాల్గొన్నారు..



# రదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జరగాలి

**మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి**



**సంస్థాన్ నారాయణపూర్, మే 24( క్రైమ్ మిర్రర్ ప్రతినిధి):** కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న ఆరు గ్యారంటీలో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో గందరగోళం నెలకొన్నదని సంస్థాన్ నారాయణపూర్ గ్రామ మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక షరతులు పెట్టి అర్హుల జాబితాను క్రమంగా తగ్గిస్తుందని వారన్నారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లలో అవకాశం కల్పించాలన్నారు. రాజకీయ పార్టీల తోటి సంబంధం లేకుండా ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఇందిరమ్మ కమిటీలను నియమించిన విషయం మనందరికీ తెలిసిందే. ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామస్థాయిలో అధికారులతో చర్చించి పారదర్శకంగా రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగాలని వారన్నారు. మన పార్టీ వాడా,కాదా అని ఆలోచన చేస్తూ ఇండ్లు మంజూరు చేస్తున్నారని ఏకపక్షంగా ఎంపిక చేసే పద్ధతిని మార్చుకోవాలన్నారు. గ్రామంలో ఎవరైతే ఇండ్లు లేని నిరుపేదలున్నారో వారందరికీ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వ అధికారులపై విశ్వాసం ఉందని నిజమైన అర్హులకే ఇల్లు మంజూరు అవుతుందనే నమ్మకం ఉన్నదనే విషయాన్ని వారు గుర్తు చేశారు. గ్రామస్థాయిలో ఇందిరమ్మ కమిటీ పేర్లు గోప్యమే, అధికారులు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో చర్చించిన సమావేశాలు గోప్యమే, అధికారికంగా బహిరంగంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులతో అధికారులు సమావేశం నిర్వహించి చర్చించిన దాఖలాలయితే కనబడటం లేదు. అధికార పార్టీ నేతల చుట్టూ తిరిగితేనే ఇందిరమ్మ ఇండ్లు వస్తాయనే విధానం, గ్రామాల్లో ప్రజల్లో చర్చ జరుగుతున్న విషయం అధికారులు గమనించాలి.నిజమైన అర్హులకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తేలేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపిక ప్రక్రియలో జరిగిన అవకతవకలపై పోరాటానికి సైతం సిద్ధమని వారన్నారు. రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ జరగాలన్నారు. అద్దె ఇళ్లలో ,ఇల్లు లేక నిలువ నీడ లేక అవస్థలు పడుతున్న నిజమైన అర్హులకు అన్యాయం జరిగితే ఎంత వరదాకైనా పోరాటనికి సిద్ధమని వారికి మా పార్టీ పరంగా అండగా ఉంటామని అన్నారు. అధికార పార్టీ నాయకులు పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వం నుంచి గ్రామానికి మరిన్ని ఇండ్లు తీసుకొచ్చే ప్రయత్నం చేయాలే తప్ప, గ్రామంలోని నిజమైన అర్హుల సంఖ్యను క్రమంగా తగ్గించే ప్రయత్నం చేయొద్దనే విషయాన్ని గుర్తు చేశారు. మా పార్టీ, మీ పార్టీ అనే ఆలోచన ధోరణి లేకుండా ఇల్లు ఉన్నదా లేదా అనే విషయాన్ని గుర్తించి సర్వే నిర్వహించి ఎంపిక ప్రక్రియ జరగాలన్నారు.ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగకుంటే ప్రభుత్వ కార్యాలయాల ముందు నిజమైన అర్హులతో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా గ్రామస్తుల సమక్షంలో గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన వారి జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయానికి అతికించాలన్నారు. నిజమైన అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరయ్యే వరకు మీ పక్షాన బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు భరోసా కల్పించారు.




## విద్యను వ్యాపార వస్తువుగా మారుస్తున్న పాలకులు

- పేదలకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షలా మారింది
- చౌటుప్పల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులు

**చౌటుప్పల్, మే 24(క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ):** ప్రయివేటు,కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రభుత్వ కనుసన్నల్లో నడుపుతూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ పేదలకు నాణ్యమైన విద్యను పాలకులు దూరం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతుల్లో మాట్లాడుతూ విద్యను వ్యాపార వస్తువుగా మార్చి పేద మధ్యతరగతి విద్యార్థులకు అందని ద్రాక్షలా మారుతుందన్నారు.కార్పొరేట్ విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులను యదేచ్ఛగా పెంచుకుంటున్నా విద్యా సంబంధిత అధికారులు, పాలకులు చూసి చూడనట్లు వ్యవహరి స్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా ఎలాంటి అనుమతులు లేకున్నా నారాయణ, చైతన్య వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు ఆవహించాయి. ప్రభుత్వాన్ని నడిపే మంత్రులు, ఎంపీ,ఎమ్మెల్యే,టీచర్ ఎం.ఎల్.సి లు విద్యా సంస్థలను నడిపిస్తూ విద్యను వ్యాపారం చేస్తుంటే పేద విద్యార్థులకు ఎం న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వాలు మారినా పాలకుల బుద్ధి మారదంలేదని అన్నారు. ఇప్పటివరకు తెలంగాణా రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేకపోవడం విదపై పాలకులకు ఉన్న చిత్త శుద్ధి కనబడుతుందని అన్నారు. వెంటనే ప్రయివేటు, కార్పొరేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించి అందరికి సమాన నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడ్య రాజు, చౌటుప్పల్ మండల కార్యదర్శి తెగుల్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, ఈర్ల రాహుల్,పుట్టల ఉదయ్ కుమార్,పొట్లచెర్వు గాయత్రి,నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మేళచెర్ల చెన్నగిరి లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి



**సంస్థాన్ నారాయణపూర్, మే 24(క్రైమ్ మిర్రర్ ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో శ్రీ మేళచెర్ల చెన్నగిరి లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజ నిర్వహించిన స్వామివారి దీవెనలు పొందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, మెంగ యాదయ్య, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, కంకణాల గూడెం మాజీ సర్పంచ్ సరిపెల్లి శైలజ సత్యనారాయణ, ఈద శంకరయ్య, అంతటి స్వామి గౌడ్, కొండ నవీన్ గౌడ్, ఈసం శివకుమార్, బానోత్ కిరణ్, చేర్క కుటుంబసభ్యులు, గ్రామ ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు.

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : నవారు మల్లారెడ్డి


**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** అల్మాస్ గూడ గ్రామ పరిధి 24వ డివిజన్ జయశంకర్ కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం మొదలు పెడుతున్న సందర్భంగా భూమి పూజకు హాజరై లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ తరపున శు భాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి. అల్మాస్ గూడ గ్రామ పరిధి 7వ డివిజన్లలో సొంత స్థలం ఉన్న వారిని గుర్తించి 25 మంది ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులుగా ఎంపిక చేయటం వారికి ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తూ వార్డ్ అధికారులతో కలిసి ప్రొసిడింగ్ పత్రాలు ఇవ్వటం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడదిన్నర కాలంలోనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఒక్కో హామీ, వాగ్దానాలు నెరవేరుస్తున్న క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు నాలుగు లక్షల మందికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవటానికి నిధులు మంజూరు చేయటం పేదోడి సొంతింటి కల నెరవేర్చటం సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంకే దక్కుతుందని లబ్ధిదారుల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, నిజానికి ఎప్పటి నుండో సొంతిల్లు కోసం ఎదురుచూస్తున్న సామాన్య ప్రజల కల సాకారం చేయటం ద్వారా ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీ ది సీఎం రేవంత్ రెడ్డిదే అని ఈ సందర్భంగా మేము కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలం చెప్పదలచుకున్నాం. ఇందిరమ్మ లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇంటి నిర్మాణం చేసుకోవాలని వార్డ్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ లబ్ధిదారులతో బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మయ్య గౌడ్, శ్రీనుచారి, శంకర్, చంద్రం, సాయి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.






## మునుగోడులో కన్నులపండువగా నిత్య సహాయమాత పండుగ

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల కేంద్రంలోని కమ్మగూడెం యేసు నామకరణ దేవాలయంలో నిత్య సహాయ మాత పండుగ శనివారం ఘనంగా జరుపుకున్నారు..ప్రత్యేక ఆహ్వానితులుగా రోజ్ మెరియన్స్ సభ నుంచి గురువు భాగ్యరాజ్ పాల్గొని దివ్యబలి పూజ సమర్పించారు.ప్రార్థన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గడచిన సంవత్సర కాలమంతా కలిగిన మేలులకు కృతజ్ఞతగా నిత్య సహాయమాత పండుగ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధి,సంఘం బలోపేతానికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.నిత్య సహాయమాత సందేశాన్ని భక్తులకు వివరించారు.సాయంకాలం వేళ గ్రామ పురవీధులలో నిత్య సహాయ మాత విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేసిన తేరులో ప్రదక్షిణంగా ఊరేగించారు. నూతనంగా ఏర్పాటు చేసిన తేరును రావెల రమేష్ బాబు మేరి కుటుంబ సభ్యులు దేవాలయానికి బహుకరించారు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను దేవాలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు.దివ్యబలి పూజ అనంతరం ఏర్పాటు చేసిన విందు భోజనాన్ని మండల కేంద్రానికి చెందిన చెన్నోజు రాజు రమాదేవి దంపతులు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా దాతలకి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ మత గురువులు ప్రతాప్, ధనరాజ్,రాయప్ప, చిన్నయ్య,అంతోని, గ్రామస్తులు మార్నేని ప్రభాకర్, గ్రెగోరీ, సాగర్, మధు, సుధాకర్, తంబి, జోసఫ్, రాజా, భాస్కర్, రవి, లూర్ధురాజు, విజయ్, ఆరోగ్యం, ప్రకాష్, జ్వాకిమ్, వినయ్ పాల్గొన్నారు.



# ఘనంగా జనంపల్లి మధుసూదన్ రెడ్డి ప్రధమ వర్ధంతి

**నివాళులర్పించిన పలువురు నేతలు**

**కూకట్ పల్లి, మే 24 (క్రైమ్ మిర్రర్) :** రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి సోదరుడు జనంపల్లి మధుసూదన్ రెడ్డి ప్రథమ వర్ధంతి కొత్తపల్లి గ్రామం, వనపర్తి జిల్లా లో కురుమూర్తి స్వామి దేవాలయ మాజీ చైర్మన్ జనంపల్లి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, చిల్డ్రన్ వెల్ఫేర్ చైర్మన్ సీత దయాకర్, అరవింద్ రెడ్డి, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, స్థానిక వివిధ పార్టీల నాయకులు పాల్గొని మధుసూదన్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు జె పురేందర్ రెడ్డి, జే భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు, మిత్రులు, అధిక సంఖ్యలో పాల్గొని నివాళు లర్పించారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలి**

**కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి**

**కూకట్ పల్లి, మే 24 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లో రోడ్డు నంబర్ 3 సి బ్లాక్, 3 బి బ్లాక్, 4 బి బ్లాక్, 15 బి బ్లాక్ లలో జరుగుతున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పాపిరెడ్డి నగర్ కాంటెస్టెడ్ అధ్యక్షులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ అరేకపూడి గాంధీ, కూకట్ పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు బస్తి లోని సిసి రోడ్ల నిర్మాణ పనులను శ్రీధర్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పాపి రెడ్డి నగర్ బస్తీలో జరుగుతున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను చేపడుతున్న అధికార సిబ్బంది కాలనీ వాసులకు ఇబ్బంది కలగకుండా అధికార సిబ్బంది ఒకరికి ఒకరు సహకరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాపిరెడ్డి సీనియర్ నాయకులు చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, యాదగిరి మేస్త్రి, షమీమ్ పాషా, అక్కిరెడ్డి, దామోదర్ రెడ్డి, అరుణ్ పంతులు, రఘుమా రెడ్డి, రాము గౌడ్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ చారి, నర్సింహారెడ్డి, జగదీష్ ప్రసాద్, సర్వర్, మీన, వసంత దేవి, స్థానిక నేతలు పాల్గొన్నారు.



# తప్పిపోయిన ఇద్దరు బాలలను రెండు గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

**బాలానగర్, మే 24 (క్రైమ్ మిర్రర్) :** రాత్రి సమయంలో తప్పిపోయిన ఇద్దరు బాలలను బాలానగర్ పోలీసులు రెండు గంటల వ్యవధిలోనే వారిని గుర్తించి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. బాలానగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.నరసింహ రాజు తెలిపిన ప్రకారం ఈనెల 23 న రాత్రి 9 గంటల సమయంలో చెరబండరాజునగర్ నివాసి తనుష్(3) బాలానగర్ మెయిన్ రోడ్డులోని బీబీఆర్ ఆసుపత్రి వద్ద ఏడుస్తూ బాలానగర్ పెట్రో కారు 1 పోలీసు సిబ్బందికి కనిపించాడు. బాలుడిని బాలానగర్ పోలీసు స్టేషన్ కు తీసుకెళ్లారు. బాలుడి ఫోటోను స్థానికంగా ఉన్న అన్ని కాలనీ అసోసియేషన్ వాట్సప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు రాత్రి 11 గంటలకు బాలానగర్ పోలీసు స్టేషన్ కు వెళ్ళారు. బాలుడిని బాలానగర్ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఇదే రోజు గిరినగర్ కు చెందిన రావి రోహిత్(10) రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లో నుండి తప్పిపోయాడు. తల్లిదండ్రులు తక్షణమే బాలానగర్ పోలీసు స్టేషన్ కు వెళ్ళి బాలుడికి సంబంధించిన ఫోటో అందించారు. బాలుడి ఫోటోను పోలీసులు చుట్టుపక్కల పోలీసు స్టేషన్ లకు మిస్సింగ్ కేసు కింద పంపించారు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో సంబంధిత ఫోటోలో ఉన్న బాలుడు కనిపించాడని జగద్గిరిగుట్ట పోలీసులు బాలానగర్ పోలీసులకు సమాచారం అందించారు. బాలుడిని తల్లిదండ్రులకు బాలానగర్ పోలీసులు క్షేమంగా అప్పగించారు. తప్పిపోయిన మైనర్ బాలలను అతితక్కువ సమయంలో గుర్తించి పట్టుకోవడం పట్ల తల్లిదండ్రులు బాలానగర్ పోలీసుల పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో తప్పిపోయిన పిల్లలు అసలు దొరుకుతారో లేదో తెలియని భయం, అయోమయంలో ఆందోళన చెందుతూ వెతుకులాడుతున్న సమయంలో పోలీసులు చురుకుగా స్పందించి ఆచూకీ కోసం చేసిన ప్రక్రియ ద్వారా పిల్లలు దొరకడం ఎంతో హర్షించదగ్గ విషయమని కన్నీటితో ఆనందాన్ని తల్లిదండ్రులు వ్యక్తం చేశారు.




# పహల్గాంలో తీవ్రవాదులతో వీరోచిత పోరాటం చేసి విజయగర్వంతో స్వస్థలానికి చేరిన వీర జవాన్

**శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికిన చిన్ననాటి మిత్రులు**



**కూకట్ పల్లి, మే 24 (క్రైమ్ మిర్రర్) :** పహల్గాంలో సింధూర్ ఆపరేషన్ సైనికులతో కలిసి పనిచేసేన మన భారత దేశ సైనికుడు సిద్దిపేట జిల్లా, నంగునూరు మండలం, నర్మెట గ్రామానికి చెందిన బందారం రాజు ఇటీవల పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో అజేయుడుగా నిలిచి విజయగర్వంతో స్వస్థలానికి శనివారం శంషాబాద్ విమానాశ్రయానికి విచ్చేసిన రాజును తన చిన్ననాటి స్నేహితులు పంతం వెంకటేష్, సుద్దాల లింగారెడ్డి పూల బొకే అందించి చాలువతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రదేశాలను చూడడానికి పర్యాటక సందర్శకులు వస్తుంటారు. దీనిని ఆసరాగా తీసుకుని ఉగ్రవాదులు దాడికి తెగబడి అమాయకులను పొట్టన పెట్టుకున్నారు. ఇది ఉత్తర భారతదేశం, జమ్మూ కాశ్మీర్, అనంత్‌నాగ్ జిల్లాలో ఉన్న అనంతనాగ్ నగరానికి 45 కి.మీ దూరంలో, లిడ్డర్ లోయలో, లిడ్డర్ నది ఒడ్డున, హిమాలయాలలో 7200 అడుగుల ఎత్తులో ఉంది. పహల్గామ్ ప్రసిద్ధ పర్యాటక కేంద్రం, హిల్ స్టేషన్. ఇది అమర్‌నాథ్ యాత్రకు ప్రారంభ స్థానికంగా ఉంది. ప్రతి సంవత్సరం ప్రపంచం నలుమూలల నుండి వేలాది మంది పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. 2025లో ఉగ్రదాడి పహల్గామ్ ఉగ్రదాడికి సంబంధించిన కీలక ఆధారాలను జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐ సేకరిస్తోంది. బైసరన్ లోయలో పర్యాటకుల ఫోటోలు, వీడియోలు తీసే స్థానిక వీడియోగ్రాఫర్ ఉగ్రదాడి ఘటన మొత్తాన్ని వీడియోలు తీసినట్లు ఎన్ఐఏ వర్గాల సమాచారం. వాటిని విశ్లేషిస్తున్న దర్యాప్తు అధికారులు ఉగ్రవాదులను వారికి సహకరించిన స్థానికులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.



# రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రతి రైతు పాల్గొనాలి

**గుండాల క్రైమ్ మిర్రర్:యాదాద్రి భువనగిరి జిల్లా:** గుండాల మండలంలోని అనంతారం వెల్మజాల క్లస్టర్ రైతు వేదికలో రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కార్యక్రమాన్ని ఏఈఓ శ్వేత ఆధ్వర్యంలో ప్రారంభించి మాట్లాడుతూ పట్టేదారు పాసుబుక్కు కలిగి ఉన్న ప్రతి రైతు తమ తమ గ్రామాలకు అనుబంధం ఉన్న రైతు వేదికల వద్ద వ్యవసాయ అధికారిని కలిసి తమ పేరును నమో చేయించుకోవాలని అన్నారు వెల్మజాల అనంతారం రైతు వేదికలో ఈ ప్రక్రియను మొదలుపెట్టామని రైతులందరూ సహకరించి సకాలంలో తమ వివరాలు నమోదు చేసుకుని అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దయాకర్ రెడ్డి రైతు ఉత్పత్తి సంఘం చైర్మన్ ఈ నాగరాజు ప్రసన్న గ్రామ రైతులు పాల్గొన్నారు.



# రాహుల్ కు పాకిస్తాన్ కు ఉన్న సంబంధం ఏంటి?

**రాహుల్ కు పాకిస్తాన్ కు ఉన్న సంబంధం ఏంటి?**

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్**



**క్రైమ్ మిర్రర్ పెగడపెల్లి:** ఆపరేషన్ సింధూరం ద్వారా పాకిస్తాన్ కు జరిగిన ధన, మాన, ప్రాణ నష్టాన్ని పాకిస్తాన్ ఒప్పుకుంటున్న రాహుల్ గాంధీ మాత్రం ఒప్పుకోవడం లేదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం విమర్శించారు. పహాల్గామ్ సంఘటన జరిగి పదిహేను రోజులు గడువక ముందే పాకిస్తాన్ లోని తొమ్మిది తీవ్రవాద స్థావరాలను పెల్చివేసి పదకొండు ఎయిర్ బేస్ లను కూల్చివేచి 170 మందికి పైగా తీవ్రవాదులను మట్టి కరిపించి నలభై రెండు మంది పాక్ ఆర్మీని చంపి తగిన బుద్ధి చెప్పితే పాకిస్తాన్ కాళ్ళ బేరానికి వస్తే సీజ్ ఫైర్ చేసినందుకు రాహుల్ గాంధీకి వచ్చిన నొప్పి ఏంటని ప్రశ్నించారు. సీజ్ ఫైర్ విషయంలో ఏదేశం ప్రమేయం లేదని ప్రధానమంత్రి, హొామ్ శాఖ మంత్రి, రక్షణ శాఖ మంత్రి స్పష్టంగా చెప్పినప్పటికి అదే విషయాన్ని రాహుల్ గాంధీ పదే పదే వల్లే వేయడం స్వదేశాన్ని అవమానించడమేనని అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా చివరి రోజునజమ్ము కాశ్మీర్ లో ఉగ్రవాదులను దగ్గరినుండి చూశానని వాళ్లు నాతో మాట్లాడాలని అన్నారని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతమో లేదా పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాదులకు భారత్ లో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఏమైనా అన్నదమ్ముల కొడుకులా అని ప్రశ్నించారు. ఉగ్రవాదుల గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకులు ఉగ్రవాదులు రాహుల్ ను కలిసి మాట్లాడాలి అన్న విషయంలో ఎందుకు స్పందించడం లేదన్నారు. దేశ సైనికులను అవమానిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సైనికులకు స్వేచ్ఛ లేదని కాల్పులు జరపాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరని అందుకే వేలాది సైనికులు మరణించారని అన్నారు. ఇంటి దొంగను ఈశ్వరుడు అయినా పట్టలేడు అన్న చందంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారం ఉందని ఎద్దేవాచేశారు. పాకిస్తాన్ తో యుద్ధం ఎందుకు జరుపలేదని ప్రశ్నించిన రాహుల్ ఇందిరమ్మ హయాంలో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో ఇందిరాగాంధీ నిర్ణయం భేష్ అంటున్న రాహుల్ మరి అదే సమయంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను ఎందుకు స్వాదీనం చేసుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. దేశ రక్షణకు సంబందించిన రహస్యాలు గోప్యంగా ఉంచుతారని అవి ఎవరికి చెప్పాల్సిన అవసరం లేదన్నారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు పాకిస్తాన్ లో ఎక్కువ ట్రెండ్ అవుతున్నాయంటే రాహుల్ కు పాకిస్తాన్ లోనే ప్రేమికులు ఎక్కువగా ఉన్నారని అర్థం అవుతుందని ఎద్దేవాచేశారు.


# ఉపాధ్యాయ వృత్యాంతర శిక్షణ...విద్యార్థులకు రక్షణ

**-ఉపాధ్యాయులు విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించాలి**

**-ముగిసిన ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ తరగతులు**

**-చౌటుప్పల్ మండల విద్యాధికారి ఈ గురువారావు**

**చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్:** తరగతి గదిలో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ఉపాధ్యాయ వృత్యాంతర శిక్షణ తరగతులు దోహదపడతాయని చౌటుప్పల్ మండల విద్యాధికారి ఈ గురువారావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి గురువారావు పర్యవేక్షణలో ఈనెల 20 నుండి నిర్వహిస్తున్న ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గురువారావు ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడుతూ... ప్రభుత్వ బడులను బలోపేతం చేసే దిశగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని మార్గనిర్దేశకం చేశారు. వృత్యంతర నేర్చుకున్న శిక్షణ ద్వారా విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించి నిష్ణాతులుగా తయారు కావాలన్నారు. అనంతరం వృత్యంతర శిక్షణ ఉపాధ్యాయులు మాట్లాడుతూ... విద్యార్థులు నేర్చుకునేలా చేస్తే వారు దానిని చాలాకాలం పాటు గుర్తుంచుకుంటారని అన్నారు. ఈ శిక్షణ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పై అవగాహన పెంచుకున్నామన్నారు. ఈ వృత్యంతర శిక్షణ వల్ల అన్ని సబ్జెక్టుల పై అవగాహన, అభ్యసన సామర్థ్యాలు, బోధనలో మెలకువలపై





మరింత పట్టు సాధించేందుకు ఎంతగానో ఉపయోగపడింది అన్నారు. మండల విద్యాధికారి ఈ గురువారావును, మండల రిసోర్స్ పర్సన్ లను ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ లు ప్రసాద్, ఐ శ్రీనివాస్, సంధ్య, లింగస్వామి, వెంకటేశ్వర్లు, రామలింగం, రామ్మూర్తి, రామిరెడ్డి, ఎం భాస్కర్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, ఎంఆర్సీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి పర్యటన అంటే నిర్బంధపు అరెస్టులేనా..



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్)::** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన అంటే బిఆర్ఎస్ నాయకుల నిర్భందపు అరెస్టులేనా అని, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు చెరుకు లింగం గౌడ్ అన్నారు.. రేవంత్ రెడ్డి పర్యటనలు జరిగిన ప్రతిసారి ముందస్తు అరెస్టులు, నిర్భంధాలు ఎందుకు, ఇదేనా ప్రజాపాలన అంటూ ఆయన హెదేవా చేశారు.. నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనలో, సెంచు సోదరులను, నేడు జహీరాబాద్ లో రైతులను అరెస్టు చేశారని, జహీరాబాద్ నిమ్స్ చుట్టూ ఉన్న గ్రామాలను అష్టదిగ్బంధనం చేయడం సరికాదన్నారు..ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అరాచకాలు ఉన్నాయని ఆయన అన్నారు.. నిర్భంధాలు, కంచెలు, ఆకాంక్షలు, అరెస్టులు లేకుండా ముఖ్యమంత్రి పర్యటన జరిగే పరిస్థితి లేదని, రాష్ట్రంలో అక్రమంగా అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేసారు.



# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై

**కుత్బుల్లాపూర్, మే 24 (క్రైమ్ మిర్రర్) :** లంచం తీసుకుంటూ ఓ ఎస్సై ఏసీబీకి చిక్కిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషనులో చోటు చేసుకుంది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బల్కంపేటకి చెందిన జారీ కమల్ బ్యాండ్ సిబ్బంది జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ శుభకార్యకానికి హాజరై బ్యాండ్ వాయించారు. కాగా శబ్ద కాలుష్యానికి పాలపడుతున్నారని ఆ బ్యాండ్ కు చెందిన వాహనాన్ని సామాగ్రిని సీజ్ చేసిన ఎస్సై శంకర్, ఆ వాహనాన్ని సామాగ్రిని తిరిగి ఇచ్చేందుకు 15 వేల రూపాయలు డిమాండ్ చేశాడు. ఆ మొత్తాన్ని జగద్గిరిగుట్టకు చెందిన నాగేందర్ ను మధ్యవర్తిగా పెట్టుకొని, ఆ మొత్తాన్ని తనకు ఇవ్వాలని బాధితులను కోరాడు. ఎస్సై వేధింపులు తాళలేక, బాధితుడు ఏసీబీ కి ఫిర్యాదు చేయగా, ఎస్సై డిమాండ్ మేరకు శనివారం ఉదయం బాధితుడు 15 వేల రూపాయల నగదును మధ్యవర్తి నాగేందర్ కు అందజేశారు. అతడు ఆ మొత్తాన్ని ఎస్సై కు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అవినీతికి పాల్పడిన ఎస్సై శంకర్, అతనికి సహకరించిన నాగేందర్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# చెత్త చెదారంతో దుర్వాసన “ ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**1 వ వార్డులో బయటికి వెల్లలేని పరిస్తితి**

**అపరిశుభ్రంగా చండూరు రోడ్డు వాటర్ ట్యాంక్ పరిసరాలు**



**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల కేంద్రంలోని గాంధీనగర్ 1 వ వార్డు ప్రధాన రహదారి ప్రక్కన చెత్త చెదరంతో నిండి దుర్వాసన వెదజలుతున్నది..అటుగా వెళ్ళాలి అంటేనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు..గాలి దుమారం వస్తే చెత్త కాగితాలు ఇండ్లల్లోకి వస్తున్నాయని,దుర్వాసనతో బయటికి వెళ్ళలేక పోతున్నామని ప్రజలు వాపోతున్నారు..ఒక వైపు కుక్కలు ఒక వైపు దోమల బెడధతో ఇబ్బందులు, అనారోగ్యానికి గురి కాకుండా సంబంధిత అధికారులు పట్టించుకొని చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.



# జలవిహార్ ను జయప్రదం చేయండి -టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు గురుపాదం,

మర్రిగూడ(క్రైమ్ మిర్రర్): జర్నలిస్టుల జలవిహార్ జాతర మహాసభను జయప్రదం చేయాలని, టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు గాలెంక గురుపాదం, మర్రిగూడ మండల అధ్యక్షులు వడ్డె రమేష్ అన్నారు.. మర్రిగూడ ప్రెస్ క్లబ్ లో వారు మాట్లాడుతూ, టియుడబ్ల్యూజే ఏర్పడి ఈనెల 31వ తేదీ నాటికి, 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భంగా, టియుడబ్ల్యూజే రజతోత్సవ మహాసభను హైదరాబాదులోని జలవిహార్ లో నిర్వహించడం జరుగుతుందన్నారు.. ఈ సభకు అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. అనంతరం గోడ పత్రికను యూనియన్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే యూనియన్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి గుణగంటి యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షులు కొంపల్లి నాగరాజు గౌడ్, కోశాధికారి ఎండి. అబ్దుల్ రజాక్, గట్టుపల్ మండల టియుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి సిద్ధగోని మహేష్ గౌడ్, స్థానిక నాయకులు ఎలిమినేట్ సత్తిరెడ్డి, దుబ్బ మల్లేష్, సిరిపంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగంగా చెత్త, ప్లాస్టిక్ వాడకం నిషేధం

**నిబంధనలు పాటించకపోతే జరిమాన ఎంపిడిఓ విజయభాస్కర్**




మునుగోడు క్రైమ్ మిర్రర్ : గ్రామాల్లో వాతావరణం బాగుండేలా గ్రామాలు అద్దంలా మెరిసేవిధంగా, మురుగు కాల్వలు పరిశు భ్రంగా ఉండేవిధంగా కార్యదర్శులు సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శుక్రవారం రోజు అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో శనివారం అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు..శనివారం రోజు ఇంచార్జీ ఎంపిడిఓ విజయభాస్కర్, ఎంపీఓ స్వరూపరాణి, కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి లు మండల కేంద్రంలో పర్యటించి దుకాణదారులకు బహిరంగంగా చెత్త వేయకూడదని,ప్లాస్టిక్ వాడకం నిషేధించడం జరిగిందని నోటీసులు అందజేశారు.. ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని, లేనియెడల జరిమానా విధించడం జరుగుతుందని ఎంపిడిఓ తెలిపారు..




# జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేశపాల భూపాల్‌కు సన్మానం





గండిపేట్(క్రైం మిర్రర్): రాజేంద్రనగర్ సర్కిల్ జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టీఐ కమీషనర్‌గా నియమితులైన దేశపాల భూపాల్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. మాణిక్యమ్మ కాలనీలోని ఆయన నివాసంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి ఆయనను అభినందించారు. బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం న్యాయవృత్తిలో ఉంటూ అన్ని వర్గాల పేద ప్రజలకకు చాలా రకాలుగా సేవ చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన చేసిన సేవలను గుర్తించి రాజ్యాంగ బద్ధమైన ఆర్‌టీఐ కమీషనర్‌గా ఎంపిక చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ఎడ్లకాడి సూర్యం, ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, మంగళారం శ్రీనివాస్, జాతీయ ఎమ్మార్పీఎస్ నాయకుడు వనం నర్సింహ్మామాదిగ, జయంతోత్సవ వ్యవస్థాపక అధ్యక్షులు పోయిల జీవన్‌దాస్, ఎన్.వెంకటేష్, క్యాసారం శంకర్‌రావుమాదిగ, మాజీ అధ్యక్షులు సోమారం రాజ్‌కుమార్, పలుగుచెరువు మహేష్, పంబాల రాజు, నవజ్యోతి సంఘం మాజీ అధ్యక్షులు అప్పరెడ్డి గూడెం భీమయ్య, పత్యాల నర్సింహ్మ, పోయిల మోహన్‌రావు, గడ్డం సామేల్, అనుముల జాన్‌పాల్, ప్రశాంత్‌మాదిగ, బర్ల సుమన్, గోల్కొండ యాదయ్య, ఎ.బాబురావు, వీర్లపల్లి నవీన్‌కుమార్, గోదుగు సంజీవ, సంతోష్, మల్కారం ప్రసాద్, పెరుమల శివ తదితరులు పాల్గొన్నారు.

# రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి అనూహ్య స్పందన

**పిజెటిఎయూ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య**

**- 600 గ్రామాల్లో 37,000 రైతులతో అవగాహన కార్యక్రమం**

**- రైతుల్లో అసంతృప్తి లేదు.. కానీ చేయాల్సింది చాలా ఉంది**

గండిపేట్(క్రైం మిర్రర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు రాష్ట్రవ్యాప్తంగా నిరాటంకంగా, విజయవంతంగా సాగుతోంది. మే 5వ తేదీన వికారాబాద్ జిల్లా ధరూర్ లో ఈ కార్యక్రమాన్ని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి, పిజెటిఎయూ ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య లాంచనంగా ప్రారంభించారు. ఆరోజు నుండి ఈ కార్యక్రమం నేటి వరకు 600 గ్రామాల్లో నిర్వహించగా సుమారు 31,000 మంది పురుషులు, 6,000 మంది మహిళలు పాల్గొనటం జరిగింది. ఈ కార్యక్రమంలో మొత్తం 37,000 మంది రైతులతో శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు ముఖాముఖిగా మాట్లాడారు. ఇప్పటివరకు ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లురవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి .చిన్నారెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, ఎమ్మెల్సీలు, సుమారు 25 మంది శాసనసభ్యులు, వివిధ స్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులతో పాటు వారంలో ఒకరోజు ఉపకులపతి, ఇతర విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పిజెటిఎయూ శాస్త్రవేత్తలు, విద్యార్థులు, వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, అభ్యుదయ రైతులు, రైతు గ్రూపులు, సంఘాల ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఆరు అంశాలైన తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించడం, అవసరం మేరకే రసాయనాలను వాడి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, వివిధ ఇన్ పుట్స్ కొనుగోలుకు సంబంధించిన రశీదులని భద్రపర చుకోవడం, సాగునీటిని ఆదా చేయడం, పంట మార్పిడులను పాటించి సుస్థిరాదాయాన్ని పొందడం, చెట్లను నాటి పర్యావరణాన్ని రక్షించడం వంటి వాటిపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు రైతాంగానికి అవగాహన కల్పిస్తున్నారు. అలాగే రైతులు అడుగుతున్న అనేక సందేహాలను శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో నివృత్తి చేస్తున్నారు.

**ఉపకులపతి సమీక్ష...**

మూడు వారాలుగా సాగుతున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం పై ఉపకులపతి అల్దాస్ జానయ్య ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ కార్యక్రమానికి రైతాంగం నుంచి మంచి స్పందన వస్తుందని వివరించారు. ప్రభుత్వం రైతాంగానికి అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల పై రైతాంగంలో ఎటువంటి అసంతృప్తి లేదని జానయ్య స్పష్టం చేశారు. అయితే మారుతున్న వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాల కారణంగా రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుందని తెలిపారు. అలాగే ఇంకా కొన్ని వ్యవసాయ అంశాలకి ప్రభుత్వపరంగా ప్రోత్సాహం ఇవ్వవలసిందిగా రైతులు కోరుతున్నారని జానయ్య అన్నారు. ముఖ్యంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఎదురయ్యే నష్టాల్ని అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం పంటల బీమా సదుపాయం ప్రవేశపెట్టాలని రైతులు కోరుకుంటున్నారని, అలాగే చిన్న, సన్నకారు రైతులకి ఆధునిక వ్యవసాయ పనిముట్లని మరియు పచ్చి రొట్ట విత్తనాలను రాయితీపై అందించాలని, విస్తృతంగా భూసార పరీక్షలు నిర్వహించాలని రైతాంగం కోరుకుంటున్నారని అల్దాస్ జానయ్య వివరించారు. ఇదే స్పూర్తితో రైతు సోదరులు, మహిళలు, అభ్యుదయ రైతులు, రైతు గ్రూపులు, సంఘాల ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని దీన్ని ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఉపకులపతి కోరారు.

# సెల్‌ఫోన్ దొంగను పోలీసులకు అప్పగించిన స్థానికులు

గండిపేట్(క్రైం మిర్రర్): సెల్‌ఫోన్‌లు దొంగలించి పారిపోతున్న ఓ దొంగను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ఓ దొంగ స్థానికంగా సెల్‌ఫోన్‌లను దొంగలించి తన జేబులో పెట్టుకోని వెళ్తున్నాడు. ఈ సమయంలో రోడ్డు దాటుతుండగా ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. అతడి జేబుల్లో ఉన్న ఫోన్లు కిందపడిపోవడంతో స్థానికులు గమనించి అతడిని ప్రశ్నించారు. దొంగతనం చేసి తీసుకువచ్చాడని గుర్తించిన స్థానికులు నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకోని జనాల నుంచి అపహరించిన సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకోని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

**రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి**



**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడంలో అధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలో శనివారం స్థానికుల విజ్ఞప్తి మేరకు జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రై నేజీ పైపులైన్ వ్యవస్థ దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే కలుషిత నీటి సరఫరా రావడం వల్ల నీరుని టెస్టింగ్‌కి పంపించి వ్యర్థ పదార్థాలు కలవకుండా చూడాలని సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన దశల వారిగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమస్యలకు సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మన్మోహన్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, రావుల భాస్కర్, రాజేష్, బాల్‌రెడ్డి, రవీందర్, అనిల్, రవి, శంకర్‌రెడ్డి, జలమండలి డీజీఎం రేణుక, సూపర్‌వైజర్ లోక్‌నాథ్, రవినాయక్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రణాళికాబద్ధంగా యువతకు ఉపాధి కల్పన చర్యలు



**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ ప్రతినిధి):** యువతకు ఉపాధి కల్పనకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు. 5 వేలకు పైగా మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో వైరా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను రాష్ట్ర డిప్యూటీ సిఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఉద్యోగ మేళాలో 80 కు పైగా కంపెనీలు పాల్గొని, 5 వేల మందికి పైగా ఉద్యోగాలు ఇవ్వడానికి కంపెనీ ప్రతినిధులు ముందుకు వచ్చారని , యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అన్ని మార్గాలు అన్వేషించి అమలు చేస్తున్నామని అన్నారు. రాజకీయాలకు అతీతంగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, దీనిని అందరూ వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. యువత వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని, చిన్న ఉద్యోగం ఐనా ముందు జాయిన్ కావాలని, ప్రతి నిమిషం విలువైనదని, ఉద్యోగం చేస్తూ కూడా యువత తమ అభివృద్ధి, లక్ష్యాల సాధన కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉండాలని డిప్యూటీ సీఎం సూచించారు. యువత అనేక ఆశలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొందని, కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పాలకులు గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించ లేకపోయారని, యువతకు ఉపాధి అవకాశాలు చూపించడంలో వైఫల్యం చెందారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం రాగానే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేశామని, యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలని చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి సంవత్సరంలోనే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలు విజయవంతంగా నిర్వహించామని అన్నారు. పట్టణాలలో మెగా జాబ్ మేళా ను నిర్వహిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు 9 వేల కోట్ల పెట్టుబడితో రాజీవ్ యువ వికాసం పథకం క్రింద రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నాడు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నామని అన్నారు. వైరా శాసనసభ నియోజకవర్గ పరిధిలో మెగా జాబ్ మేళా కార్యక్రమంలో 8 వేలకు పైగా యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వీరిలో చాలా మందికి నేడు ఉపాధి లభిస్తుందని అన్నారు. వైరా నియోజకవర్గ పరిసరాలలో ఉన్న నాగార్జున సాగర్ కాల్వ, వైరా చెరువు, ఇతర చెరువులకు సమృద్ధిగా నీరు అందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం క్రింద ప్రత్యేకంగా రాజీవ్ కేనాల్ ను 100 కోట్ల రూపాయలతో పూర్తి చేశామని అన్నారు. వైరా చెరువు కాల్వల పునరుద్ధరణ కోసం 44 కోట్లు మంజూరు చేశామని అన్నారు. చిన్న నీటి బొట్టు వదలకుండా రైతుల పొలాలకు సాగునీరు మళ్లించేలా చర్యలు చేపట్టామని డిప్యూటీ సీఎం తెలిపారు. రైతులకు దాదాపు 21 వేల కోట్లతో 2 లక్షల రూపాయలు రుణమాఫీ పూర్తి చేశామని, రైతు భరోసా క్రింద 18 వేల కోట్లు బడ్జెట్ లో పెట్టామని అన్నారు. పంట భీమా అమలు చర్యలు తీసుకుంటున్నామని, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందించామని, డ్రిప్ ఇరిగేషన్ కు సబ్సిడీ అమలు చేస్తున్నామని అన్నారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలకు సాగునీరు సౌకర్యం కల్పించేందుకు 12 వేల 600 కోట్లతో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించామని, ఈ పథకం క్రింద 2 లక్షల 10 వేల ఎకరాల భూములలో బోర్లు, సోలార్ మోటార్, డ్రిప్ ఇరిగేషన్ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. పేదలకు రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, ఈ సంవత్సరమే 5 లక్షల రూపాయల విలువైన ఇందిరమ్మ ఇళ్లు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3 వేల 500 మంజూరు చేస్తామని, రాబోయే ఐదు సంవత్సరాల పాటు డ్వాక్రా సంఘాలకు లక్ష కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు అందించనున్నామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ చేస్తున్నదని తెలిపారు. నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో వైరా నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, యువతకు అవసరమైన స్కిల్ అందించేందుకు ఐటిఐ కళాశాలలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ గా అప్ గ్రేడ్ చేశామని అన్నారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సింగరేణి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహణ చాలా సంతోషంగా ఉందని అన్నారు. జాబ్ మేళా కు దాదాపు 8 వేల మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకుందని, దాదాపు 5 వేల మందికి 80 కంపెనీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని అన్నారు. యువతకు వచ్చిన అవకాశాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని, జాబ్ మేళా లో వచ్చిన ఉద్యోగాల్లో ఎటువంటి సమస్య వచ్చినా అవసరమైన సహకారం జిల్లా యంత్రాంగం నుంచి అందిస్తామని అన్నారు. మెగా జాబ్ మేళా నిర్వహణలో సహకరించిన డిప్యూటీ సీఎం కు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూలో ఎంపికయిన యువతకు వివిధ కంపెనీల ఆఫర్ లెటర్ లను డిప్యూటీ సీఎం అందజేశారు. ఈ మెగా ఉద్యోగ మేళాలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సింగరేణి సిఎండి బలరాం, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, సింగరేణి జనరల్ మేనేజర్ శాలోమ్ రాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.